నేటి నుంచి 'ఫెడరేషన్' నామినేషన్లు

మణికొండ: ఆల్ కాలనీస్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫెడరేషన్ మణికొండ మున్సిపాలిటీ నూతన కార్యవర్గ ఎన్నికలకు మంగళవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఎన్నికల్లో భాగంగా ఈ నెల 9వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 4, 5 తేదీల్లో నామినేషన్ల దాఖలు, 6వ తేదీన ఉపసంహరణ, 7వ తేదీన ఫైనల్ లిస్టు ఉంటుందని ఎన్నికల అధికారులు ఎం.సత్యనారాయణ మూర్తి, బీవీ సత్యనారాయణ తెలిపారు. నామినేషన్లను ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, తిరిగి సాయంత్రం 6 నుంచి రాత్రి 8గంటల వరకు సాయిరాంనగర్ కమ్యూనిటీ హాల్‌లో అందజేయాలని వారు వివరించారు.

ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు


ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మూడు ఫిర్యాదులు అందినట్లు ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం రెండు, పారిశుద్ధ్య విభాగానికి సంబంధించిన ఒక ఫిర్యాదు అందినట్లు వెల్లడించారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులను అందజేశామన్నారు. అధికారులు సంబంధిత ఫిర్యాదు స్థలానికి వెళ్లి పరిశీలించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తారని వెల్లడించారు. సర్కిల్ పరిధిలోని ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్

శంషాబాద్: అనధికారిక లేఅవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరించేందుకు తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.సుమన్‌రావు సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో జీవో 111 మినహాయించి ఉన్న సాతంరాయి, హుడాకాలనీ, ఎయిర్‌పోర్టు కాలనీలో మాత్రమే ఎల్ఆర్ఎస్ వర్తిస్తుందన్నారు. దీని కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ప్రస్తుతం కూడా దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు. మార్చి 31లోపు పూర్తి చేసుకున్న వారికి ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు ప్రభుత్వం ఫీజులో 25 శాతం రాయితీ కూడా ప్రకటించిందన్నారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసేందుకు మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్ అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి మనోహర్‌తో పాటు వార్డు అధికారులు, బిల్‌కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి


జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శివసాయినగర్ కాలనీవాసులు

బండ్లగూడ: వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని శివసాయినగర్ కాలనీవాసులు కోరారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివసాయినగర్ కాలనీ వాసులు మాజీ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్‌తో కలిసి నీటి సమస్యపై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యపై ఆయన సానుకూలంగా స్పందించి జీఎం మహేందర్‌నాయక్‌కు ఫోన్ చేసి తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రంగస్వామి, రమణారెడ్డి, రామారావు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో 16న ప్రత్యేక జాబ్ మేళా

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని శిక్షణ, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ హైదరాబాద్‌లో చివరి సంవత్సరం చదివే విద్యార్థులు, ఉత్తీర్ణులైన విద్యార్థులకోసం ప్రత్యేక జాబ్ మేళా/ఫెయిర్‌ను ఏర్పాటు చేసినట్లు 'మనూ' శిక్షణ, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ యూసుఫ్‌ఖాన్ సోమవారం తెలిపారు. ఫ్యాకల్టీ అవసరాలు, ఖాళీలు ఉన్న ఆసక్తి గల కళాశాలలు/పాఠశాలలు/సంస్థలు రిజిస్ట్రేషన్ ఫీజు రూ 10వేలు చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందని ఆయన వివరించారు. మరిన్ని వివరాల కోసం డాక్టర్ యూసుఫ్‌ఖాన్(9848171044) అసిస్టెంట్ ప్రొఫెసర్ గుఫ్రాన్ బర్కతి(9044145228) కార్పొరేట్ కన్సల్టెంట్ సమీర్‌పాషా (9700064077)లో సంప్రదించాలని ఆయన కోరారు.

వావ్.. మిల్లెట్స్ ఈట్




రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ, జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మిల్లెట్స్ మేళా రైతులను ఆకట్టుకుంది. మిల్లెట్స్‌తో తయారు చేసిన వివిధ తినుబండారాలు, ఇతర పదార్థాలు, పలు రకాల మిషన్లను ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, వ్యాపారులు ఇక్కడ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. – ఏజీవర్సిటీ





చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

జాతీయ చిరుధాన్యాల రైతు సదస్సులో కేంద్రమంత్రి భగీరథ్ చౌదరి


జాతీయ మిల్లెట్స్ మేళాను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి భగీరథ్ చౌదరి

ఏజీవర్సిటీ: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే చిరుధాన్యాల ఆహారం ఎంతో ముఖ్యమని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి అన్నారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఐఐఎంఆర్ డైరెక్టర్ సితారా సత్యవతి ఆధ్వర్యంలో జాతీయ చిరుధాన్యాల రైతుల సదస్సు–2025 నిర్వహించారు. జాతీయ చిరుధాన్యాల మేళాను ఏర్పాటు చేశారు. సదస్సులో కేంద్ర మంత్రి భగీరథ్ చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని మేళాను ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశానుసారం జై జవాన్–జైకిసాన్–జై విజ్ఞాన్ అనే నినాదం స్ఫూర్తితో దేశ భద్రత, రైతు సంక్షేమం, శాస్త్రీయ అభివృద్ధి అనేవి సమానంగా ఎదగాలని పనిచేస్తున్నామని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్య, ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ రాజారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం


సుధాకర్‌గౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

బండ్లగూడ: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, రోజురోజుకూ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సుధాకర్‌గౌడ్ మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో సోమవారం చేరారు. ఈ సందర్భంగా ఆయనకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన కొనసాగుతోందన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రావుకోళ్ల నాగరాజు, మాజీ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువు.. క్రీడలు రెండూ ముఖ్యమే..

ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో తెలంగాణ అంతర్ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడాపోటీలను నిర్వహించారు. 35 కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పోటీలకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్, సెల్‌ఫోన్‌కు బానిసగా మారవద్దు అన్నారు. ఆటల పోటీలతో క్రమశిక్షణ, సృజనాత్మకత శక్తి పెరిగి ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎస్.జయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ ఎస్.ధనుంజయ్‌రెడ్డి, ట్రెజరర్ అగ్నిహోత్రి, ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఉషశ్రీ, హెచ్‌వోడీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుసూదన్, అధ్యాపకులు, వివిధ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

మణికొండలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి



అగ్నిమాపకశాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: రెండు లక్షలకు పైగా జనాభా ఉండి, తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్న మణికొండ మున్సిపాలిటీలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డిని కోరారు. వట్టినాగులపల్లిలోని ఐఅర్‌డీఏ కార్యాలయంలో సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం మాట్లాడుతూ ఇటీవల మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలో రెండు అగ్ని ప్రమాదాలు జరిగాయన్నారు. ఓ ప్రమాదంలో ఫర్నిచర్ కాలిపోయి పక్కనున్న అపార్ట్‌మెంట్ వాసులకు తృటితో పెను ప్రమాదం తప్పిందన్నారు. మరో ప్రమాదంలో ఏకంగా ఇద్దరు మహిళలు, ఓ బాలిక మృతి చెందారన్నారు. గతంలో బాబానివాస్ లాంటి అపార్ట్‌మెంట్ ప్రమాదంలో ఏకంగా 8మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఇప్పటికైనా స్పందించి ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, జి.విఠల్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, యాలాల కిరణ్, ప్రవీణ్, సుమనళిని, షేక్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కోటి వృక్షార్చన వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అటవీ శాఖ ప్రధాన ముఖ్య కార్యదర్శి రాకేష్ మోహన్ డోబ్రియల్

శంషాబాద్ రూరల్: తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్(టీఎస్ఎస్ఓ) ఆధ్వర్యంలో చేపట్టనున్న కోటి వృక్షార్చన వాల్ పోస్టర్‌ను రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన ముఖ్య కార్యదర్శి రాకేష్ మోహన్ డోబ్రియల్ సోమవారం ఆవిష్కరించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపు సంకల్పంతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని సూచించారు. ప్రతి విద్యార్థి సమాజిక బాధ్యతగా మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని టీఎస్ఎస్ఓ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీ నివాస్ పిలుపునిచ్చారు.

వుడ్ షాట్ బ్యాడ్మింటన్ అకాడమీ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: అత్యాధునిక శిక్షణా సౌకర్యాలతో వుడ్ షాట్ బ్యాడ్మింటన్ అకాడమీ అత్తాపూర్‌లో ఏర్పాటైంది. దీన్ని సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా సౌకర్యాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రావడం అవసరమన్నారు. ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులు శిరీష మాట్లాడుతూ.. భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దేందుకు ఈ అకాడమీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత, బిగ్ ఎఫ్ఎం ఆర్జె క్రిష్‌తో పాటు పలువురు బ్యాడ్మింటన్ ఆటగాళ్లు, కోచ్‌లు క్రీడా ఔత్సాహికులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు శ్రీనివాస్

మణికొండ: రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా అద్దంకి చెందిన శ్రీనివాస్(30) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చి నార్సింగిలో నివసిస్తున్నాడు. మణికొండలోని మౌంట్ లిటేరా జీ స్కూల్‌లో పనిచేస్తున్న అతడు ఆదివారం రాత్రి తన ఇంటికి సమీపంలోని కిరాణా షాపునకు వెళ్లి వస్తున్న క్రమంలో వివేకానందనగర్ కాలనీలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దాంతో శ్రీనివాస్ కింద పడిపోయాడు. 108కు సమాచారం ఇవ్వగా వారు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

జోనల్ కమిషనర్‌కు సన్మానం

చాంద్రాయణగుట్ట: చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సహకరించినందుకు కమిటీ చైర్మన్ ఎ.మహేష్‌గౌడ్ సోమవారం జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నను సన్మానించారు. ఆయన కార్యాలయంలో కలిసి శాలువా కప్పి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆలయ మెట్ల అభివృద్ధికి రూ.7 లక్షలు మంజూరు చేయడం సంతోషకరమన్నారు.

ప్రణాళికతో ముందుకు సాగితేనే విజయం

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థినులు

మణికొండ: ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు పాటిస్తూ.. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేలా ప్రణాళికతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం, తరగతి గదులు ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సేవా సంస్థలు, ఐటీ సంస్థలు కృషి చేస్తున్నాయని ఆయన అన్నారు. నార్సింగి ఉన్నత పాఠశాలలో అలాంటి సంస్థల సహకారంతో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. విద్యార్థులు ఒత్తిడితో కాకుండా ఇష్టంగా చదివినప్పుడే మంచి మార్కులు వస్తాయన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయ్‌కుమార్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, నార్సింగి మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, నాయకులు ప్రవీణ్‌యాదవ్, డి.కిరణ్‌కుమార్, కె.వినోద్‌కుమార్, పొన్న రమేష్, లక్ష్మీప్రవళిక కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శివాలయ భూకబ్జాను అడ్డుకుంటాం

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి


దేవాలయాన్ని పరిశీలించిన తోకల శ్రీనివాస్‌రెడ్డి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, గౌలిదొడ్డిలోని పురాతన శివాలయం భూమిని కొందరు బడాబాబులు కబ్జాకు యత్నిస్తున్నారని, దాన్ని అడ్డుకునేందుకు స్థానికులకు అండగా ఉంటామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విషయం తెలుసుకుని స్థానిక నాయకులతో కలిసి దేవాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌలిదొడ్డి సర్వే నంబర్–188లో 18.30గుంటల పట్టా భూమి ఉండగా అందులో పురాతన శివాలయం ఉందన్నారు. 1980 సంవత్సరంలో సదరు భూయజమాని ఐదు ఎకరాల భూమిని దేవాలయానికి వదిలిపెడతామని గ్రామస్తులకు తెలిపారన్నారు. భూముల ధరలు పెరగటంతో కొంత కాలానికి రెండు ఎకరాల భూమిని దేవాలయం పేరుతో గిఫ్ట్ డీడ్ చేశారన్నారు. అయినా సదరు రెండు ఎకరాల భూమిని ప్రస్తుతం కబ్జా చేసేందుకు నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. కబ్జాదారులపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేసి దేవాలయ భూమి జోలికి రాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.నాగేష్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు భిక్షపతియాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ అప్లికేషన్స్ ఫీల్డ్ వెరిఫికేషన్‌లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ఎల్ఆర్ఎస్ అప్లికేషన్స్ ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ అప్లికేషన్స్ ఫీల్డ్ వెరిఫికేషన్‌పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ ఎంఏ అండ్ యూడిలోని నిబంధనలు అధికారులకు, కార్పొరేషన్ పరిధిలోని వివిధ డెవలపర్స్‌కు వివరిస్తున్నట్లు చెప్పారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పిస్తోందన్నారు. కార్పొరేషన్ పరిధిలో విస్తృత స్థాయిలో ప్రచారం, కాల్ సెంటర్, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రొహిబిటెడ్ ల్యాండ్స్, వాటర్ బాడీస్‌కి 200 మీటర్లకు బయట ఉన్న వాటిని తక్షణమే గుర్తించి ఈ నెల 31వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్ ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు, వార్డు అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సమావేశంలో వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, రిసోర్స్ పర్సన్స్(ఆర్‌పీలు) డెవలపర్స్ పాల్గొన్నారు.

జయమ్మ సేవలు అభినందనీయం


జయమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఎంఈవో శంకర్ రాథోడ్

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న జయమ్మ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. 27 సంవత్సరాలు ఈ పాఠశాలకు జయమ్మ సేవలు అందించారని కొనియాడారు. ఎంఈవో శంకర్ రాథోడ్, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సృజన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు సుదర్శన్, సరళమ్మ, రూపాదేవి, రాజమహేందర్‌రెడ్డి, వెంకటయ్య, జనార్దన్‌చారి, సుధాకర్, అంజయ్య, జంగయ్య, గ్యాంగ్యా నాయక్, కరుణాకర్, సురేశ్, నర్సింహచారి, శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో దేవి అహల్యాబాయి జయంతి


సెమినార్‌లో ముఖ్యఅతిథి మురళీ మనోహర్

మణికొండ: సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయడంతో పాటు రాణిగా పక్షపాతం లేని పాలన అందించిన ఘనత దేవి అహల్యాబాయి హోల్కర్‌కి దక్కిందని కేంద్ర విశ్వవిద్యాలయాల ఈసీ సభ్యుడు ప్రొఫెసర్ పి.మురళీ మనోహర్ అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో ఆమె జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17వ శతాబ్దంలోనే ఆమె విద్యావేత్తగా, జాతి నిర్మాణం, సామాజిక ఆర్థిక సంస్కరణల పద్ధతులను అవలంబించిందన్నారు. మహిళల కోసం ప్రత్యేక సంస్కరణలను చేపట్టి వీరవనితగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు, ఎయిడెడ్ ఇంజినీరింగ్ కళాశాలల సలహాదారుడు ప్రొఫెసర్ ఎస్.రాజిరెడ్డి, ఎంజీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌రెడ్డితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో రాణించిన మనూ విద్యార్థులు



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్– రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీ(సీఎస్ఈ–ఆర్‌సీఏ)కి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యార్థులు జాతీయస్థాయి సైన్స్ క్విజ్‌లో రాణించారు. ప్రతిష్టాత్మకమైన నేషనల్ సైన్స్ క్విజ్‌లో దేశవ్యాప్తంగా దాదాపు 45 కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన వారితో ఈ విద్యార్థులు పోటీ పడ్డారు. అందులో 'మనూ' బృందంలో డాక్టర్ మిన్హాజ్ అహ్మద్, ఎండీనజీర్, ఎస్‌డీ సోహెల్ పాల్గొని జాతీయ స్థాయిలో రెండవ స్థానంలో నిలిచారు. ఇటీవల సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో సైన్స్ ఆధారిత క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.